


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 19-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 35 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## విజయదశమి శుభాకాంక్షలు

పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
**విజయదశమి శుభాకాంక్షలు**
-- ఎడిటర్

విమర్శలకు దిగేముందు

## నిగ్రహం పాటించండి



వార్త 2వ పేజీలో..



కేంద్రం స్పందించకపోవడం

# మహాదారుణం

- ప్రజల కష్టాలు ప్రతిపక్ష నేతలకు పట్టవా?
- హోదా కోసం మీటూ తరహా ఉద్యమం
- రెండు మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం
- ప్రజల మధ్యే దసరా పండుగ
- సీఎం చంద్రబాబు నాయుడు

శ్రీకాకుళంః కేంద్రానికి మానవత్వం లేదన్నారు ఏపీ సీఎం చంద్రబాబు. భయంకరమైన తుఫాన్ వచ్చినా స్పందించకపోవడం దారుణమన్నారు. వారికి బాధ్యత లేదా అంటూ మడిపడ్డారు. గురువారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన చంద్రబాబు.. ప్రజల మధ్యే దసరా పండుగను జరపుకున్నారు. ఈ సందర్భంలో మాట్లాడిన చంద్రబాబు.. కేంద్రం, ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. తరువాయి 6లో..




మాజీ గవర్నర్ తివారి

## కన్నుమూత

ఉమ్మడి ఏపీ గవర్నర్‌గా తివారి
మ్యాక్స్ ఆస్పత్రిలో మృతి



ఢిల్లీ : కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్డీ తివారి (93) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూశారు. తివారి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌కు సీఎంగా సేవలు అందించారు. అలాగే తరువాయి 2లో..









# శ్రీ మహాకామేశ్వరీ పీఠంలో అత్యంత వైభవంగా పవిత్రోత్సవం



విశాఖపట్నం: పెందుర్తి, సాదుమఠం దరి, పవిత్రోత్సవంలో అమ్మవారి 'మణిద్వీప వర్ణన' గానం చేస్తుండగా, అమ్మవార్లు మూర్తులకు అర్చన చేసిన విధానం అద్భుతం. ఈ పవిత్రోత్సవం చందనం, పసుపు, కుంకుమ, జీడిపప్పు, పండ్లు, తమల పాకులు, అత్తరు, సెంటు, కర్పూరం దండ అమ్మవారికి సమర్పించారు.

అమ్మవారి ఒడిలో వేసిన చలిమిడి పవిత్రమైంది. దానిని భక్తులకు అనుగ్రహించారు.

ఈ ఉత్సవంలో అనేకమంది దంపతులు పాల్గొని అమ్మవారి కృపను పొందారు.

దశమిరోజున అనగా నేడు అమ్మవారికి చక్రస్నానం చేస్తారు. పూర్ణాహుతి జరుగుతుంది.

రేపు ఉదయం 10గంటలకు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకునరి కల్యాణోత్సవం శ్రీమాన్ ముప్పిరాల నారాయణమూర్తి బృందంచే వైభవం జరుగుతుంది. అనంతరం అన్న సంతర్పణ, లడ్డూలు ప్రసాదంగా ఇచ్చారు.

# లిపికారెడ్డి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన



విశాఖపట్నం: నగరానికి చెందిన కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం పెదవాల్తేరు దరి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవములు జరుగుచున్నవి. ఈ సందర్భంగా నాట్య పరిమళ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ లిపికారెడ్డి శిష్యబృందం వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. ఇందులో శిష్యబృందం వారిచే ముందుగా వినాయకకృతంతో కూచిపూడి నాట్యం కె.ఇందిరాప్రియ, వి.గగణస్ఫూర్తి, వి.సాయి రోషిణి, కె.హిమబిందు నృత్యం ప్రదర్శించారు. తరువాతి అంశంలో మహిషాసురమర్ధిని అవతారంలో బి.లిపికారెడ్డి నృత్యంను ప్రదర్శించారు. సంస్థ డైరక్టర్ పోల లిపికారెడ్డి మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన వారికి, భక్తజనులకు మరియు కరకచెట్టు పోలమాంబ ఆలయ సిబ్బందికి, అర్చకులకు అభినందనలు తెలిపారు.

# తిత్లీ బాధితులకు విద్యాశాఖ సాయం రూ. 13.66 కోట్లు

### మంత్రి గంటా శ్రీనివాసరావు



శ్రీకాకుళం : తుపాను బాధిత ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు మంత్రులు, రాష్ట్ర అధికారులంతా శ్రీకాకుళంలోనే ఉండి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన ఆయన నగరంలోని ఓ హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుపాను బాధితుల సహాయార్థం జిల్లాలోని విద్యాశాఖ పరిధిలోని ఉద్యోగులంతా ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చేందుకు నిర్ణయించినట్లు మంత్రి గంటా తెలిపారు. జిల్లా విద్యాశాఖ రూ. 57 లక్షల ఆర్థిక సాయం ఇస్తోందని, జూనియర్ కళాశాలల నుంచి రూ. 4 లక్షలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయం నుంచి రూ. 5 లక్షలు, రాష్ట్రంలోని విద్యాశాఖ ఉద్యోగులు రూ. 500 చొప్పున సహాయం అందించనున్నట్టు వివరించారు. మొత్తంగా విద్యాశాఖ తరపున రూ. 13.66 కోట్ల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఎన్ఆర్ఐలు, విశాఖపట్నంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు కలిపి రూ. 2 కోట్లు సహాయం ఇవ్వనున్నట్టు చెప్పారు.

**రూ. 43 కోట్ల నష్టం**


తుపాను ధాటికి జిల్లాలో విద్యాశాఖకు రూ. 43 కోట్ల నష్టం వాటిల్లిందని మంత్రి వెల్లడించారు. 697 పాఠశాలలు దెబ్బతినడంతో రూ. 38 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. నాలుగు డిగ్రీ కళాశాలలు దెబ్బతినగా రూ. 1.35 కోట్లు, 14 జూనియర్ కళాశాలలకు రూ. 2.36 కోట్లు, ఆరు మోడల్ పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించి రూ. 1.46 కోట్లు, ఒక పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 25 లక్షల నష్టం వాటిల్లినట్టు మంత్రి వివరించారు. ఈ నెల 22 నుంచి పాఠశాలలు తెరవనుండడంతో విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పాఠశాలల భవనాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించామన్నారు. పాఠశాల భవనాల తక్షణ మరమ్మతులకు రూ. 2.50 కోట్లు విడుదల చేస్తామని తెలిపారు.

**జ్ఞానభేరి వాయిదా**

జిల్లాలో ఈ నెల 22న నిర్వహించతలపెట్టిన జ్ఞానభేరిని వాయిదా వేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. తుపాను కారణంగా ఈ కార్యక్రమం నిర్వహించడం లేదని, సాధారణ పరిస్థితులు నెలకొన్న తరవాతే నిర్వహిస్తామన్నారు. తుపాను సహాయక చర్యల్లో 1000 మంది విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలు అందిస్తున్నారన్నారు. విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ కూన రవికుమార్, డీఈఓ ఎం.సాయిరాం, సర్వశిక్షా అభియాన్ పీఓ ఎస్.త్రినాధరావు, ఎన్ఆర్ఐలు జయరాం, ప్రసాద్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తాం

### పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



కంచిలి : రాష్ట్రంలో 3,51,000 కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలియజేశారు. కంచిలి మండలంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్ డిపోలకు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరం కన్నా ఎక్కువ దూరంలో ఉన్న మారుమూల గ్రామాలకు రేషన్ సరకులు అందేలా ప్రత్యేకంగా మూడు రోజులు కేటాయించామన్నారు. మూడు రోజుల్లో రేషన్ డీలర్లు సరకులను నేరుగా గ్రామాలకు తీసుకెళ్లి అందజేసేలా ప్రత్యేక జీవో విడుదలచేశామన్నారు. తిత్లీ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తుపాను ప్రభావిత మండలాల్లో పోలాకి, సారవకోట, మెళియాపుట్టి మండలాలను కొత్తగా చేర్చినట్టు వివరించారు.

కొత్తగా చేర్చి మండలాలకు ఉచిత రేషన్ సరకులు అందజేయనున్నట్టు తెలిపారు. ప్రతినెల 15తేదీ లోపు అందుకోవాల్సిన రేషన్ సరకులను శ్రీకాకుళం జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు తీసుకోలేకపోయారని వీరి కోసం గడువును ఈ నెలాఖరుకు పొడిగించామన్నారు.

ముఖ్యమంత్రి అదేశాల మేరకు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు విద్యుత్తుబిల్లులు చెల్లించుకోలేకపోయిన వారికి మరో నెల రోజుల పాటు అపరాధరుసుం లేకుండా చెల్లించే వెసులుబాటు కల్పించినట్టు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలియజేశారు.

కంచిలి మండల ప్రత్యేక ఐఏఎస్ అధికారి శ్రీధర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలను ఆదుకునేది తెదేపా ప్రభుత్వమే



శ్రీకాకుళం : ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆదుకునేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ప్రతిపక్షాలకు అధికార వాంఛ తప్ప, ప్రజల కష్టాలు పట్టవని రాష్ట్ర మంత్రులు కాలవ శ్రీనివాసులు, అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇచ్ఛాపురం పురపాలకసంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తుపాను సమస్యను వివరిస్తూనే, ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతాలను వివరించారు. తుపాను తరువాత మూడు రోజుల పాటు మంత్రులు, అధికారులు జిల్లాలోనే తిరుగుతున్నారని చెప్పారు. అధికారులు చక్కగా సేవలందించారని, ప్రజలు అర్థంచేసుకుని, పూర్తిగా సహకారం అందించారన్నారు. ఇది నచ్చని ప్రతిపక్షనేత గ్రామా లలో తమవారిచేత రచ్చ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వాటిని ప్రజలూ గమనిస్తున్నారన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన ప్రతిపక్ష పార్టీ నాయకుడు బాధిత ప్రజలను ఆదుకోవడం తెలియక పెట్రోల్ డ్రామాను నడిపారని, వారి రాజకీయం అలా ఉంటుందని విమర్శించారు. జిల్లాలో 48,265 ఇళ్లకు నష్టం వాటిల్లింది. వాటిలో పక్కాఇళ్లు 3,774 ఉన్నాయని గృహనిర్మాణ శాఖామంత్రి శ్రీనివాసులు తెలిపారు. 20,442 పురిళ్లని, మంత్రులు ప్రత్యక్షంగా 14వేల ఇళ్లను పరిశీలించామన్నారు. నష్టాలపై అంచనాకు 344మంది అధికారులను 105 బృందాలుగా పంపించామన్నారు.

మొదటి పేజీ తరువాయి

## మాజీ గవర్నర్ ఎన్డీ తివారి కన్నుమూత

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్‌గా కొనసాగారు. తివారి మృతి పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో పాటూ రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఉత్తరాఖండ్ సీఎంగా ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. ఈ ఏడాది జులైలో ఎన్డీ తివారి అనారోగ్యంతో మ్యాక్స్ ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి ఐసీయూలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గురువారం ఆయన పరిస్థితి విషమించడంతో కన్నుమూసినట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. అంతేకాదు జన్మదినం రోజే తివారి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

తివారి పూర్తి పేరు నారాయణ దత్ తివారి. 1925 అక్టోబర్ 18న ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌జిల్లా బాలూటి గ్రామంలో జన్మించారు. రాజకీయాల్లోకి వచ్చాక 1967లో జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారు. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా.. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగానూ ఆయన సేవలందించారు. 2007 ఆగస్టు 19న ఏపీ గవర్నర్‌గా నియమితులైన తివారి 2009 డిసెంబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు.

### విమర్శలకు దిగేముందు

# నిగ్రహం పాటించండి

**- టీడీపీ నేతలకు పవన్ స్ట్రాంగ్ వార్నింగ్**

**- ఇంకా అంధకారంలోనే సగం గ్రామాలు**

శ్రీకాకుళం : తిత్లీ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తోన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏపీ సర్కారుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జియో ట్యాంగింగ్ ద్వారా తమకు జరిగిన నష్టాన్ని ఫొటోలు తీసి పంపాలని ప్రజలను కోరుతూ.. ఏపీ సర్కారు ఓ యాప్ ప్రారంభించింది. కానీ ఆరు రోజులు గడిచినప్పటికీ.. ఇంకా సగం గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయని పవన్ తెలిపారు. చీకట్లో మగ్గుతున్న వారికి వెలుతురును ప్రసాదించడంటూ సీఎం చంద్రబాబును కోరుతూ పవన్ ట్వీట్ చేశారు. బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారని జనసేనాని తెలిపారు.

సైక్లోన్ ప్రభావిత ప్రాంతాల్లో నా పర్యటన కారణంగా పునరావాస, సహాయక కార్యక్రమాలకు ఎలాంటి అవరోధాలు తలెత్తొద్దని భావించాను.

అందుకే నా పర్యటనను వాయిదా వేసుకున్నాను. అంతే కానీ కవాతు వల్ల కాదని పవన్ తెలిపారు. విమర్శలు దిగే ముందు నిగ్రహం పాటించడం నేర్చుకోవాలని ఆయన టీడీపీ నేతలకు సూచించారు.



*33వార్డు తాటి చెట్ల పాలెం లో దుర్గదేవి నవరాత్రులు దుర్గఅష్టమి పురస్కారిశీచుకొని భారీగా 2000 మందికి అన్నదానశీ కార్యక్రమశీ జరిగిశీది ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధి ఉత్తర నియోజక వర్గం సమనవ్వ కర్త కె. కె. రాజు ప్రారంభించారు ఈ కార్య క్రమములో వైఎస్ఆర్ సీపీ జిల్లా డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఆళ్ళ శ్రీను గారు, కార్యధర్శి బోడ్డేటి గంగ మహేశ్, కమిటి సభ్యులు. మరియు వార్డు నాయకులు పాల్గొన్నారు.*

## వైభవంగా దసరా శరన్నవరాత్రి వేడుకలు

తిరుపతి: తిరుపతిలో దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం విజయదశమి సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకోడానికి ఆలయ అధికారులు ప్రత్యేక పూజను ఏర్పాటు చేశారు. వేంకటేశ్వర స్వామికి చెల్లెలుగా ప్రాచుర్యం పొందిన గంగమ్మ తల్లి... తిరుమల తిరుపతికి గ్రామ దేవత. ఈ 9 రోజులు అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆఖరు రోజైన గురువారం సాయంత్రం గంగమ్మ తల్లి శ్రీ రాజరాజేశ్వరి అలంకారంతో పుష్పపల్లికిపై పురవీథుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ జనసేన తీర్థం

శ్రీకాకుళం: టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి జనసేనలో చేరారు. జిల్లా పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్ తుఫాన్ బాధితులను పరామర్శిస్తున్నారు. చదలవాడ శ్రీకాకుళం వెళ్లి పవన్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా చదలవాడకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

గత వారమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ జనసేనలో చేరారు. తాజాగా చదలవాడ కూడా జనసేనలో చేరడంతో చేరికలు ఊపందుకున్నాయి. చదలవాడకు 1999లో కాంగ్రెస్ పార్టీ ఇవ్వకపోవడంతో తెలుగుదేశం పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక టీటీడీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. పదవీకాలం ముగిశాక..

కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

## వైభవంగా కనకదుర్గమ్మ తెప్పోత్సవం



విజయవాడ: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా మహోత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం జరుగుతోంది. గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

తెప్పోత్సవాన్ని తిలకించేందుకు కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తున్నారు. తెప్పోత్సవ హంసవాహన సేవలో త్రిలోక సంచారానికి గుర్తుగా గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి మూడుసార్లు ప్రదక్షిణగా జలవిహారం చేయిస్తారు. మరోవైపు విజయ దశమినాడు కనకదుర్గమ్మ శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

# అప్పన్న జమ్మివేట ఉత్సవం నేడే



సింహాచలంః శ్రీ సింహాద్రి అప్పన్న దేవస్థానంలో దసరా పండుగ మహోత్సవం పురస్కరించుకొని కొండ దిగువున పూలతోటలో జమ్మివేట ఉత్సవం నేడు ఘనంగా నిర్వహించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. పూలతోట గోడలకు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో రంగురంగుల హరివిల్లుల ఆకారంలో పూలతోటను ముస్తాబు చేశారు. ప్రతీ యేడు నిర్వహించిన విధంగా ఈ సంవత్సరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకను పురస్కరించుకొని మధ్యాహ్నం 3:30 గం.లకు అప్పన్నస్వామి ఉత్సవమూర్తులు మెట్ల మార్గం గుండా కొంద దిగువున పూలతోటకు చేరుకొని సాయంత్రం జమ్మివేట ఉత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు దర్శనం అనంతరం అశ్వవాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు. అనంతరం మెట్లమార్గం గుండా సింహగిరికి ఉత్సవ మూర్తులు చేరుకోనున్నాయి. ఉత్సవం సందర్భంగా సాయంత్రం 6 గం.ల తరువాత భక్తులకు దర్శనము లభించగలదని, మరలా మరుసటిరోజు ఉదయం యధావిధిగా దర్శనము లభించునని ఆలయ అధికారులు తెలిపారు.

## ఆకర్షణీయంగా బొమ్మల కొలువు



విశాఖపట్నంః సీతమ్మధార అంబేద్కర్‌నగర్ దరి శ్రీ గురుపాద సేవా సమితి వారి ఆధ్వర్యంలో సేవా సమితి కేంద్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా దసరా విజయ దశమిని పురస్కరించుకొని బొమ్మల కొలువు ఏర్పాటు చేయుట జరిగినది. ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను, భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. మన సనాతన సాంప్రదాయానికి సంబంధించిన వివిధ కళాకృతులు, చిన్నచిన్న విగ్రహాలు బొమ్మల కొలువులు చూడటానికి విచ్చేసిన వారిని ఎంతోగానో ఆకర్షిస్తున్నాయి. గురుపాద సేవా సమితి వ్యవస్థాపకులు బాలుస్వామి, జగదాంబ దంపతులు శ్రీ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక సాంప్రదాయంలో భాగంగా విచ్చేసిన మహిళలకు, కన్యలకు తాంబూలం, వాయినము ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, శ్రీగురుపాద సేవా సమితి వ్యవస్థాపకులు బాలుస్వామి, సంస్థ ప్రతినిధి జగదాంబ, ఉపాధ్యాయిని జి.కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి మహోత్సవములు

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు, ఆలయ సిబ్బంది



వన్‌టౌన్ః నగరంలో బురుజుపేటలో వెలసిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. ఆశ్వీజ పాడ్యమి మొదలు 9 రోజులపాటు వివిధ అలంకారములలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. 18వ తేదీతో అమ్మవారి ఉత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది. ఆఖరి రోజు కనక మహాలక్ష్మి అమ్మవారు (మూలవిరాట్)ను స్వర్ణాభరణ అలంకారములో దర్శనం చేసుకున్నారు. అమ్మవారికి పళ్లు మరియు గులాబిలతో పూజ నిర్వహించడం జరిగింది. పూజ దాతలుగా ఎస్ వెంకటరమణ, ప్రకాష్ అమ్మలు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 6.30 ని.లకు తమ్మిన అనంతరామ్ కుమార్, సరిగమ సంగీత పాఠశాల - విజయనగరం వారిచే భక్తిరంజని కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.జె. మాధవి, ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి, వి. రాంబాబు, పి. రామారావు, ఎస్. సూర్యకుమారి, పర్యవేక్షకులు రాజు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



అనకాపల్లిః పోలీసులు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా వేల్పుల వీధి సీతారాముల కళ్యాణ మండపంలో పెద్ద ఎత్తున యువకులు, పోలీస్ సిబ్బంది స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు, ఆటో కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనకాపల్లి సిఐ అవతారం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు డిఎస్పీ కెవి రమణ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమానికి అనేక మంది యువకులు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదానం చేసారు. కోరిబిల్లి పరి, పలకా రవి, గొర్లి శేఖర్, శ్రీకాంత్, ఆధ్వర్యంలో యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ ఐ శ్రీనివాసరావు, అప్పన్న, ట్రాఫిక్ ఎస్‌ఐలు స్వామినాయుడు లక్ష్మణరావు, క్రైం ఎఎస్‌ఐ భాస్కరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చోడవరంః దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరంలో గురువారం విజయదశమి సందర్భంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని మేళతాళాలతో, దాండియాతో, సాంస్కృతిక కార్యక్రమాలతో, నేల వేషములతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్నసమారాధన



దసరా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం 17వ వార్డు పరిధిలో గల మానసిక వికలాంగ ఆసుపత్రి వద్ద గల ఆటో స్టాండ్ వారి ఆధ్వర్యంలో జరిగిన మహా అన్నసమారాధన కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త శ్రీనివాస్ వంశీకృష్ణ అమ్మ వారి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం భక్తులకు కొంత సమయం అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ సంఘంతో పాటు వైఎస్ఆర్ సీపీ నాయకులు రమణారెడ్డి, నైటమ్మా, నీలరెడ్డి, మంగరాజు, రామారావు రెడ్డి , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# శబరిమలలో రెండో రోజూ అదే పరిస్థితి

## న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్‌పై దాడి




కేరళః శబరిమల ఆలయంలోకి ప్రవేశించేందుకు యత్నించిన మూడో మహిళ సుహాసిని. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాధవి, కేరళ జర్నలిస్ట్ లిబినిలు బుధవారం శబరిమల వెళ్లేందుకు ప్రయత్నించినా, వారిని ఆందోళనకారులు అడ్డుకున్నారు. అన్ని వయసుల మహిళలను అనుమతించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం నెలవారీ పూజ కోసం బుధవారం అయ్యప్ప ఆలయం ద్వారాలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా కేరళలో రెండో రోజు యుద్ధ వాతావరణం నెలకొంది. శబరిమలలో ప్రవేశించేందుకు ప్రయత్నించిన కొందరు మహిళలను ఆందోళనకారులు అడ్డుకుని, వెనక్కు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో అయ్యప్ప సన్నిధానికి వెళ్లేందుకు ప్రయత్నించిన న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్ సుహాసిని రాజ్‌ను ఆందోళనకారులు అడ్డుకున్నారు. పోలీసుల సాయంతో ఆమె కొద్ది దూరం వెళ్లినా భక్తులు రహదారికి అడ్డంగా నిలబడి ఆమెపై రాళ్లదాడికి పాల్పడ్డారు. అసభ్య పదజాలంతో ఆమెను దూషిస్తూ, శబరిమలలోకి ప్రవేశానికి అనుమతించబోమని భీష్మించుకు కూర్చున్నారు. సుహాసిని, ఆమె వెంట ఉన్న ఫారిన్ జర్నలిస్ట్ చేసేదేమి లేక పంబకు తిరిగి చేరుకున్నారు. శబరిమల ఆలయంలోకి ప్రవేశించేందుకు యత్నించిన మూడో మహిళ సుహాసిని. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాధవి, కేరళ జర్నలిస్ట్ లిబినిలు బుధవారం శబరిమల వెళ్లేందుకు ప్రయత్నించినా, వారి కూడా ఇదే విధమైన అనుభవం ఎదురయ్యింది. మరోవైపు శబరిమలలోకి మహిళ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ విశ్వహిందూ పరిషత్, శబరిమల సంరక్షణ సమితి 24 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. కొజికోడ్, అటింగళ్, ఛెత్రాలల్లో కేఎస్ ఆర్టీసీ బస్సులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. కేరళలోని అన్ని దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. బీజేపీ సైతం ఈ బంద్‌కు మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆలయ ద్వారాలు తెరుచుకోగా, మహిళా భక్తులు ఎవరూ స్వామి దర్శనం చేసుకోలేదు.

మహిళలు ఆలయంలోకి ప్రవేశించకుండా ఆందోళనకారులు పోలీసుల భద్రతా వలయాలను సైతం ఛేదించుకుని వస్తున్నారు. రెండు రోజుల కిందటే నిలక్కల్ ప్రాంతానికి చేరుకున్న వందలాది మంది ఆందోళనకారులు అన్ని వాహనాలను తనిఖీ చేస్తూ మహిళలను వెనక్కు పంపుతున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ.. అనేక శతాబ్దాలుగా కొనసాగుతోన్న సంప్రదాయాన్ని ప్రస్తుతమూ కొనసాగించాలని, దీనికి ఎలాంటి మినహాయింపు ఉండబోదని అన్నారు.

మత విశ్వాసాలలో జోక్యం చేసుకుని కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయరాదని వ్యాఖ్యానించారు. పోలీసులు సైతం నిషేధాజ్ఞలు విధించారు.

## శ్రీకాకుళం ప్రజలకు విద్యుత్ శాఖ ఊరట

శ్రీకాకుళం : టిట్లీ తుఫాను కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీకాకుళం జిల్లా ప్రజలకు విద్యుత్ శాఖ ఊరటనిచ్చింది. ఈ నెల కరెంట్ ఛార్జీలను వచ్చే నవంబరులో కట్టుకునే వెసులుబాటును కల్పించింది. దీనికి ఎలాంటి అపరాద రుసుం వసూలు చేయరని తెలిపింది. టిట్లీ తుఫాను కారణంగా కష్టాల్లో ఉన్న ప్రజలకు భారం కలిగించకూడదనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఈసీడీసీఎల్ కంపెనీకి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.



# విజయభాను

## సంపాదకీయం

### చర్చనీయాంశంగా 'మీ టూ'

మీ టూ ఉద్యమం సినిమా, మీడియా రంగాలను కుదిపేసింది. ఇప్పుడు రాజకీయరంగాన్ని కూడా తాకటంతో సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. ఇప్పటికే ఆయా రంగాల్లో ఎంతో లబ్ధ ప్రతిష్టులైనవారు ఈ లైంగిక వేధింపుల ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సమయంలో తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్‌పై కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు రావటం దిగ్భ్రాంతికర విషయం. సామాజిక మాధ్యమాల వేదికగా వెలుగుచూస్తున్న ఘటనలను చూస్తే, లైంగిక వేధింపులకు వేదికకాని రంగం, వ్యవస్థ అంటూ లేదేమో అనిపిస్తున్నది. తనుశ్రీ దత్తా మొదలు కంగనా రనౌత్, గాయని చిన్మయి, గుత్తా జ్వాలా దాకా రోజుకొకరుగా తాము ఎదుర్కొన్న చేదనుభవాలను చెబుతున్నారు. ఆ ఘటనలు వారిని ఎంత తీవ్రంగా మానసికంగా, శారీరకంగా కుంగదీశాయో వాపోతున్నారు. సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారు ఎంతటి గో-ముఖ వ్యాఘ్రాలో చూపెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వ్యక్తులుగా, బాధితులుగా ఆయారంగాల్లో వారి ప్రగతి ముగిసిపోయింది. అంతేకాదు జీవితమే ముగిసినంతంగా అన్నివిధాలా నష్టపోయిన వారూ ఉన్న ఉదంతాలున్నాయి. ఇలాంటి అమానవీయ ఘటనలు అభివృద్ధిచెందిన నాగరిక సమాజానికి ప్రతీకలుగా, వేదికలు గా చెప్పుకుంటున్న వ్యవస్థల్లోనూ ఉండటమే నేటి విషాదం. మీ టూ ఉద్యమం మన దేశంలో ఏడాది కిందట మొదలై బాలీవుడ్ నుంచి తెలుగు చిత్రసీమకు చేరుకోవటమే కాదు మీడియా రంగానికి కూడా విస్తరించి మొత్తంగా సమాజాన్ని కుదిపేస్తున్నది. నిజానికి అమెరికాలో 2006లో జరిగిన ఓ ఘటన మీ టూ ఉద్యమానికి ఊపిరిపోసింది. న్యూయార్క్‌కు చెందిన తరానా బర్క్ గాల్స్ ఫర్ జెండర్ ఈక్విటీ సంస్థలో ప్రోగ్రాం డైరెక్టర్‌గా పనిచేసేది. అమ్మాయిల సమానహక్కులు, సంక్షేమం కోసం పనిచేసే ఆమెపైనే రెండుసార్లు లైంగికదాడి జరిగింది. పరాయి వ్యక్తి చేయి తాకితేనే అసౌకర్యం, కంపరమెత్తే పరిస్థితి ఉంటే, ఏకంగా తన నిస్సహాయతను ఆసరాగా చేసుకొని లైంగిక దాడిచేస్తే ఎంతటి నరకం అనుభవించి ఉంటుందో ఊహించుకోవాల్సిందే. ధైర్యాన్నంతా కూడదీసుకొని తనకు ఎదురైన భయంకర పరిస్థితులను, బాధను అంతర్జాలంలో పెట్టింది. దీన్ని సామాజిక మాధ్యమాల్లో చూసిన వేలాదిమంది బర్క్‌కు బాసటగా నిలువటమే కాదు, తాము కూడా జీవితంలో ఎదుర్కొన్న చేదనుభవాలను ప్రపంచానికి చాటుతూ మీటూ ఉద్యమాన్ని విస్తృతం చేశారు. ఇప్పుడు పదులు, వందల సంఖ్యలో మహిళలు తాము ఎదుర్కొన్న దాడుల గురించి ధైర్యంగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే హాలీవుడ్ నిర్మాత హార్వే వీన్‌స్టెన్ నుంచి తమకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి గైనెత్ పాల్ట్రో, ఎంజెలినా జోలీ ప్రపంచానికి చాటి చెప్పటంతో ప్రపంచమం తా విస్తుపోయింది. అంతేకాదు హార్వే బాధితులుగా 12 మంది మహిళలు ముందుకొచ్చి తమ గోడును తెలుపటంతో మహిళలపై జరుగుతున్న దాడుల తీవ్రత ప్రపంచానికి తెలిసివచ్చింది. ఈ ప్రకంపనలు సద్దుమనగక ముందే హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ టొబాక్ తమను లైంగికంగా వేధించాడంటూ 38 మంది మహిళలు ముందుకురావటంతో మీటూ ఉద్యమం ఇప్పుడు మహిళల ఆత్మగౌరవ ఉద్యమంగా మారింది. హాలీవుడ్, బాలీవుడ్ మీదుగా దక్షిణాదికి, తెలుగు చిత్రసీమకు విస్తరించిన మీటూ ఉద్యమం అనేకమంది ప్రముఖ వ్యక్తుల అసలు ముఖాలను ముసుగుతీసి చూపుతున్నది. ఆ మధ్యనే కాస్టింగ్ కౌచ్ అనేది తెలుగు చిత్రరంగాన్ని ఏ తీరుగా పట్టిపీడించిందో తెలిసిందే. ఓ టీవీ ఛానల్ మహిళా రిపోర్టర్ సినీ రంగంలో అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న వర్ధమాన నటిగా 2005లో చేసిన స్టింగ్ ఆపరేషన్ బాలీవుడ్ బండారాన్ని బయటపెట్టింది. ఈ స్టింగ్‌లో ప్రముఖ నటుడు శక్తికపూర్, అమన్‌వర్మ అడ్డంగా దొరికిపోయారు. సినిమాలో వేషాలు కావాలంటే తమ కోరిక తీర్చాలని షరతు పెట్టారు. ఇలా లైంగిక వేధింపులకు పాల్పడిన అహూజాకు న్యాయస్థానం ఏడేండ్ల కారాగార శిక్ష విధించింది. అలాగే పీప్లీ లైవ్‌సినిమా సహ దర్శకుడు మహమూద్ ఫారూఖీకి ఏడేండ్ల శిక్ష పడింది. ఈ జనవరిలో చెన్నై ఎక్స్‌ప్రెస్ సినీ నిర్మాత మొరానీపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తాజాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీరంగ ప్రముఖుల్లో బాలీవుడ్ నటుడు నానా పటేకర్, హిందీ రచయిత, నిర్మాత అలోక్‌నాథ్, జాతీయ పురస్కార గ్రహీత తమిళ గీత రచయిత వైరముత్తు, తమిళ నటుడు రాధారవి, మలయాళ నటుడు ముఖేష్ తదితరులు ఉండటం గమనార్హం. ఎప్పుడో దశాబ్దాల కిందటి విషయాలను ఇప్పుడు తెరమీదికి తేవటంలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నవారు, అసలు లైంగిక వేధింపుల ఉనికిని నిరాకరిస్తున్న దాఖలాలు లేవు.

## దేశంలోనే తొలి 'సొరంగ' రైల్వే స్టేషన్ !



న్యూఢిల్లీ: భారత్‌గీ చైనా సరిహద్దులో నిర్మించబోతున్న వ్యూహాత్మకంగా కీలకమైన బిలాస్‌పూర్-మనాలి-లేహ్ రైల్వే మార్గంలో దేశంలోనే తొలిసారిగా సొరంగంలో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటుచేయనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని కీలాగ్‌లో ఈ స్టేషన్‌ను నిర్మించనున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. దేశంలో సొరంగంలో 'మెట్రో' స్టేషన్లు ఉన్నా.. సొరంగంలో తొలి రైల్వే స్టేషన్' మాత్రం ఇదేకానుంది. 'బిలాస్‌పూర్-మనాలి-లేహ్ మార్గంలో జరిపిన తొలి సర్వే ప్రకారం..కీలాగ్ స్టేషన్‌ను సొరంగంలో నిర్మిస్తాం' అని ఉత్తర రైల్వే చీఫ్ ఇంజినీర్ డీఆర్ గుప్తా తెలిపారు. 27 కి.మీ పొడవైన సొరంగంలో ఏర్పాటయ్యే కీలాగ్ స్టేషన్ సముద్ర మట్టానికి 3 వేల మీటర్ల ఎత్తులో ఉంటుంది. 465 కి.మీ పొడవైన ఈ లైను నిర్మాణానికి రూ.83,360 కోట్లువ్యయం అవుతుందని అంచనా. ఈ లైను భద్రతా బలగాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని రైల్వే సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

## ఫేస్‌బుక్ ఛైర్మన్‌గా జుకర్‌బర్గ్ తొలగింపు?



వాషింగ్టన్ : ఫేస్‌బుక్‌లో చోటు చేసుకున్న డేటా హ్యాక్ ప్రకంపనాలు, ఫేక్ న్యూస్ ఇష్యూ ఆ కంపెనీ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌కు ఎసరు తెచ్చిపెడుతున్నాయి. ఈ సోషల్ మీడియా దిగ్గజ చైర్మన్‌గా మార్క్ జుకర్‌బర్గ్‌ను తొలగించాలని ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఫేస్‌బుక్ ఇంక్‌లో మెజార్టీ షేర్లను కలిగి ఉన్న నాలుగు దిగ్గజ అమెరికా పబ్లిక్ ఫండ్స్ మార్క్ జుకర్‌బర్గ్‌ను చైర్మన్‌గా తొలగించాలనే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చాయి. కంపెనీలో అతిపెద్ద అసెట్ మేనేజర్లు కూడా ఈ ప్రతిపాదనకే ఓకే చేస్తారని అవి ఆశిస్తున్నారు. ఈ ప్రతిపాదన దాఖలు చేసిన వాటిలో ఇల్లినోయిస్, రోడ్ ఐలండ్, పెన్సిల్వేనియాలకు చెందిన స్టేట్ ట్రెజర్స్, న్యూయార్క్ సిటీ కంప్ట్రోలర్ స్కాట్ స్ట్రింగర్ ఉన్నాయి. ఇలాంటి ప్రతిపాదనే ఫేస్‌బుక్‌లో 2017లో ఒకసారి వచ్చింది.

తాజాగా తీసుకొచ్చిన ప్రతిపాదన ఎంతో కీలకమైనదని రోడ్ ఐలండ్ స్టేట్ ట్రెజర్స్ వెల్లడించింది. డేటా హ్యాక్, కేంబ్రిడ్జ్ అనలిటికా స్కాండల్ వంటి సమస్యల నుంచి ఫేస్‌బుక్‌ను బయటపడేయడానికి ఇదే మార్గమని పేర్కొంది. వార్షిక సమావేశంలో ఎలాగైనా ఈ ప్రతిపాదనన చర్చించేలా చేస్తామని రోడ్ ఐలండ్ స్టేట్ ట్రెజర్ సేథ్ మాగజైనర్ చెప్పారు. ఈ విషయంపై స్పందించడానికి ఫేస్‌బుక్ అధికార ప్రతినిధి నిరాకరించారు. కంపెనీ వార్షిక సమావేశం 2019 మేలో జరగనుంది. స్వతంత్ర బోర్డ్ ఛైర్‌ను నియమించాలని బోర్డును కోరతామని తెలిపారు. ఫేస్‌బుక్‌లో ప్రస్తుతం నడుస్తున్న ఈ లుకలుకలు ప్రపంచంలోనే అతిపెద్ద సోషల్ మీడియా నెట్‌వర్క్‌గా పేరున్న ఈ కంపెనీ ప్రతిష్టను బజారుకు ఈడస్తున్నాయి. ఫేస్‌బుక్ షేర్లు 10 శాతం కిందకి పడిపోయాయి. కాగా, పెన్సిల్వేనియా ట్రెజరీ 38,737 షేర్లను, ఇల్లినోయిస్ ట్రెజరీ 1,90,712 షేర్లు, రోడ్ ఐలండ్ ట్రెజరీ 1,68,230 షేర్లను కలిగి ఉంది. అయితే జుకర్‌బర్గ్ 60శాతం ఓటింగ్ హక్కులు ఉండటంతో, ఈ ప్రతిపాదన ఈ సారైనా ఆమోదం అవుతుందో లేదో చూడాల్సి ఉంది.

### మధురవాడ దుర్గమ్మకు
## డాక్టర్ పి.వి.ఆర్. ప్రత్యేక పూజలు

దుర్గా శరన్నవరాత్రుల్లో భాగంగా మధురవాడ, చంద్రంపాలెంలో కొలువైవున్న శ్రీ సంపత్ వినాయక, శ్రీ దుర్గాలమ్మ, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి వారి (పూర్వ) గుడిలో అమ్మవారి దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవా లలో ముఖ్యఅతిథిగా హాజరైన కళా హాస్పిటల్ అధినేత, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైయస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన ప్రారంభించారు.ఈ పూజలలో ఆలయ ధర్మకర్త, ట్రస్ట్ చైర్మన్ పిల్లా పాపారావు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





## కవి సమయం

### 'అప్పులేనివాడే అపర కుబేరుడు

అప్పు అనేది ఈ రోజు అవసరంగా మారిపోయింది. ఎవరి అవసరాలకు తగ్గట్టుగా అంతా 'అప్పు' చేసి బతికేస్తున్నారు. కానీ అప్పుతో ముప్పు తప్పదు. అప్పు చేసి దానిని అనుకున్న సమయానికి తీర్చలేకపోతే అది మరింత భారమవుతుంది. వడ్డీ వ్యాపారుల అకృత్యాలు, ఆగడాలు ఈ మధ్యన బాగా వెలుగులోకి వచ్చాయి. అప్పు తప్పు కాదు. కానీ గొప్పలకు పోయి సంపాదించి తీర్చేయగలమన్న ధీమాతో అప్పు చేయకూడదు. వాయిదా పద్ధతులలో అవి కొనండి, ఇవి కొనండి అంటూ వ్యాపారసంస్థలు కూడా 'అప్పు'ను ప్రోత్సహిస్తున్నాయి. మన దేశానికీ చాలా అప్పు వుంది. ప్రతి భారత పౌరుడూ నేడు ఋణగ్రస్తుడే. 'అప్పు' చేసి సమయానికి గానీ మనం దానిని తీర్చలేకపోతే మనం మాటలు పడాల్సి వస్తుంది. దాంతో మనం నలుగురికీ చులకనయిపోతాం. అందువలన మనకు ఉన్న దాంతో అప్పు చేయకుండా బ్రతకడం మేలు. మనకున్న సంపాదనను దృష్టిలో వుంచుకుని ఖర్చులను నియంత్రించి కొంత పొదుపునూ అలవర్చుకోవాలి. అప్పుడు అప్పులు చేసే అవసరం రాదు. అప్పులేనివాడు అపర కుబేరుడంటూ ఒక శతకకవి ఇలా వ్రాశాడు.

'ఉప్పు లేని కూర హీనంబు రుచులకు
పప్పు లేని తిండి ఫలము లేదు
యప్పు లేనివాడె యధిక సంపన్నుండు
విశ్వదాభిరామ వినురవేమ'

... కవిత రచన
వడ్లమాని అన్నపూర్ణ


## పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి : దశమి సా.4.12; ధనిష్ఠ రా.2.48; ఉ.శే.వ. 6.26వ — శుక్రవారం 19-10-2018

**మేషం** : మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులలు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్న తరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతత్రా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్య లెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.


# శ్రీ సత్యసాయి అవతార లీలా వైభవం

## సంకీర్తన



యథాయథాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన యదర్మస్య తదాత్మానం సృజామ్యహం!
పవిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే
5000 సం॥ల క్రిందట శ్రీ కృష్ణ పరమాత్మ తను దేవాతి
దేవుడనని దీన సంర్షణ,
సాదు సంరక్షణ పలువురు కొరకు, ధర్మానికి గ్లాని
ఏర్పడినప్పుడల్లా మరల మరల అవతరిస్తానని
చెప్పిన మధురమైన మాటలవి
ఏ గణంబు గణించి ఏతెంచెనో నాడు
ప్రహ్లాదు పాలింప పరమ పురుషు
డే గణంబు గణించి ఏతెంచెనోనాడు
పేదకుచేలుకై వేద చరితు
డే గణంబు గణించి ఏ తెంచెనో నాడు
కవిని గాచెడు తతిం కమలనయను
డే గణంబు గణించి ఏ తెంచెనో నాడు
ధ్రువకుమారునిస ఆక తోయజాక్షు
డా గణంబె గణించి యీ అమరమాద్యు
డార్తజననాథుడీ నాడు అవతరించె

శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు
వెలిగి పర్తీశుడై నేడు పృథ్వియందు;
ఈ విధముగా తన అవతారమును గూర్చి తామే
అనేక సందర్భాలలో తెలియజేశారు
శ్రీ సత్యసాయిబాబా వారు. భగవంతుడు
మానవాకారము దాల్చి లీలా మానుష వేషధారియై
శ్రీ సత్యసాయిగా పుట్టపర్తి క్షేత్రమందు జన్మించారు.
శ్రీ సత్యసాయిబాబా వారు 1926సం॥ స్వస్తిశ్రీ
అక్షయ నామ సంవత్సరం, కార్తీక మాసం,
బహుళపక్షం, ఆర్ధా నక్షత్రం, భరద్వాజ గోత్రములో
పెద వెంకయరాజు ఈశ్వరమ్మలకు పుట్టపర్తి
కుగ్రామములో జన్మించారు.
వారు అవతరించుటకు ముందుగా గోడలకు
వేలాడదీసిన వాయిద్యములు వాటంతట అవే
శ్రావ్యముగా మ్రోగినవట.
అందరూ చూచుచుండగనే ఎక్కడ నుండియో పెద్ద
నాగుపాము పొత్తిళ్ళలో పరుండబెట్టిన పసికందుని
చుట్టుకుని పడగవిప్పి నాట్యమాడిందట.



# కేంద్రం స్పందించకపోవడం మహాదారుణం







**మొదటి పేజి తరువాయి :**

ఎవరికీ బాధ్యత లేకుండా పోతోందంటూ నిప్పులు చెరిగారు. ప్రజలు కష్టపడుతుంటే రాజకీయాలు చేయడం దారుణమన్నారు ఏపీ సీఎం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఓట్లు పడవని కేంద్రం పట్టించుకోవడం లేదా అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి ఎవరూ ఇక్కడికి వచ్చిన పాపానపోలేదని.. జనం సంక్షోభంలో ఉంటే వాళ్ల పార్టీ కార్యాలయాలు ప్రారంభించుకోవడ ఏంటంటూ బీజేపీపై పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. గుంటూరు వచ్చిన రాజ్‌నాథ్ సింగ్ శ్రీకాకుళం రాకుండానే వెళ్లిపోయారని విమర్శించారు. విపత్తులను ఎదుర్కొనే ధైర్యం ఉందని.. జగన్, పవన్ కళ్యాణ్, కేసీఆర్‌ను టీడీపీపైకి ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపు కోసమే టీడీపీ నేతల ఇళ్లలో ఐటీ సోదాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే.. మీటూ తరహా ఉద్యమం చేస్తామన్నారు బాబు.

ఇంత పెద్ద తుఫాన్ వచ్చి ప్రజలు కష్టాల్లో ఉంటే ప్రతిపక్ష నేతకు పట్టదా అని ప్రశ్నించారు చంద్రబాబు. ప్రతిపక్ష నేత ఎక్కడికెళ్లారని.. శ్రీకాకుళం రాడా అని ప్రశ్నించారు. తుఫాన్ బాధితులను పరామర్శించేందుకు.. జగన్ రెండు రోజులు పాదయాత్రకు విరామం ఇవ్వలేక పోయారని వ్యాఖ్యానించారు. ఉద్దానం అంటే ప్రాణమన్న పవన్ కళ్యాణ్ ఏమయ్యారని.. తిత్లీ బాధితుల సమస్యల పై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

తుఫాన్‌తో నష్టపోయిన ప్రజలు కన్నీరు పెట్టొద్దు.. అండగా తానుంటానని ధైర్యాన్ని చెప్పారు సీఎం. తిత్లీ కారణంగా ఉద్దాన ప్రాంతం తీవ్రంగా దెబ్బతిందని.. నష్టపోయిన ప్రతీ ఒక్కరినీ ఆదుకుంటామన్నారు. మరో మూడు రోజుల్లో గ్రామాల్లో కూలిపోయిన చెట్లన్నింటినీ తొలగిస్తామన్నారు. విద్యుత్ సరఫరా కూడా దాదాపుగా పునరుద్ధరించామన్నారు.

**ఉద్దానంపై పవన్‌కళ్యాణ్‌ది దొంగ ప్రేమ: బాబు**

ఉద్దానంపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ది దొంగ ప్రేమని సీఎం చంద్రబాబు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలోని తితలీ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఆయన మాట్లాడుతూ తుపానుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే పవన్ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఇక్కడ తితలీ బాధితులు ఇబ్బందులు పడుతుంటే.. పవన్ కవాతును కేటీఆర్ అభినందించడమేంటని చంద్రబాబు అన్నారు. తనపై మోదీ, కేసీఆర్, జగన్, పవన్ కక్షగట్టారని... తానేం తప్పు చేశానని చంద్రబాబు ప్రశ్నించారు.

విభజన హామీలు అమలు చేస్తారనే ఎన్నికల ముందు బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. విభజన హామీలు అమలు చేయకపోగా.. తెలుగుజాతిని చిన్నచూపు చూశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ, పవన్ పార్టీలను రాష్ట్రంపై ఉసిగొల్పుతున్నారని బాబు విమర్శించారు. తెలుగుజాతిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఉద్దానానికి ఇంత కష్టమొస్తే జగన్ ఎక్కడికి పోయారని చంద్రబాబు ప్రశ్నించారు. పక్క జిల్లాలో ఉన్న జగన్.. తితలీ బాధితులను పరామర్శించరా? అని నిలదీశారు. బీజేపీతో కలిసి వైసీపీ లాలూచీ రాజకీయాలు చేస్తోందని సీఎం తీవ్ర స్థాయిలో విమర్శించారు. సహాయకచర్యలను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని చంద్రబాబు ఆరోపించారు.

**హెరిటేజ్ సంస్థ విరాళం**

ఇదిలావుంటే తితలీ తుఫాను బాధితులకు హెరిటేజ్ సంస్థ రూ.66 లక్షల విరాళం ప్రకటించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆ సంస్థ డైరెక్టర్ నారా బ్రాహ్మణి చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హెరిటేజ్ సంస్థ విరాళం అందరికీ ఆదర్శమని అన్నారు. తూర్పు ఆర్గనైజేషన్ ద్వారా ఉద్దానంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చంద్రబాబు అన్నారు. తుపాను బాధితులకు ఉదారంగా విరాళాలు ఇవ్వాలని చంద్రబాబు పిలుపు ఇచ్చారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు నెల జీతం విరాళంగా ప్రకటించారని ఆయన చెప్పారు.





# వైభవంగా రథోత్సవం



యానాం: శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలల్లో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంవద్ద అగ్నికుల క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రథంపై మీసాల వెంకన్నను వేదపండితుల సమక్షంలో ప్రత్యేకంగా అలంకరించి మంత్రో త్సవాల మధ్య పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భారీ ఎత్తున బాణాసంచాల కాల్పులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ యానాం పురవీధులలో స్వామివారిని ఊరేగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఈ బ్రహ్మోత్సవాలను ప్రతియేటా నిర్వహించడం పరిపాటిగా వస్తుంది. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పలువుర దాతల సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దారిపొడవున యానాం వెంకన్న కు ప్రజలు పూజలు నిర్వహించారు. ఈ రథోత్సవంలో మంత్రి మల్లాడి క్రిష్ణారావు ఉత్సవం ముగిసే వరకు స్వామివారివెంట పాల్గొన్నారు.


పోలీసు భద్రతా ఏర్పాట్లు మధ్య ఈ ఉత్సవ కార్యక్రమం జరిగింది. ఈ ఉత్సవంలో మాజీ కౌన్సిలర్ రక్షా అంజనేయులు, సంఘ అధ్యక్షులు సేరు క్రిష్ణా, మల్లాడి సత్తిబాబు, చింతావెంకటేశ్వర్లు, కె. శ్రీను, దాసరి వీరబాబు, తంగాడి పద్మావతి, ఆయా గ్రామాల పెద్దలు, రథోత్సవాన్ని పర్యవేక్షించారు.





# కడప ఉక్కు పరిశ్రమపై కేంద్రంలో కదలిక!

దిల్లీ: విభజన చట్టం ప్రకారం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై కేంద్ర ప్రభుత్వంలో కదలిక వచ్చినట్టు కనబడుతోంది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై టాస్క్‌ఫోర్స్‌తో కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ గురువారం సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత త్వరగా వివరాలు సేకరించాలని మెకాన్ సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందంతో సమీక్షించిన కేంద్ర ఉక్కుమంత్రిత్వ శాఖ.. ఈ మేరకు ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం వివరాల కోసం వేచిచూడకుండా మిగిలిన అంశాలతో నివేదిక సమర్పించాలని మెకాన్‌కు కేంద్ర ఉక్కుమంత్రి బీరేంద్రసింగ్ నిర్దేశించారు. ముడి ఇనుము లభ్యత, గనుల లీజు, తదితర కీలక అంశాలకు సంబంధించిన వివరాలు త్వరగా రప్పించాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ లేదా ప్రైవేటు, ఉమ్మడి భాగస్వామ్యంతో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేసే అవకాశంపైనా చర్చించినటట్టు తెలుస్తోంది. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెదేపా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.



# మా వాళ్ల పనులు చేయకుంటే ఉద్యోగాలు ఊడదీస్తాం



నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో మంత్రి అఖిలప్రియ హల్‌చల్ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు మాట మాత్రమైనా చెప్పకుండా ఆమె లేని సమయంలో ఛాంబర్‌లోకి వెళ్లి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి భూమా అఖిలప్రియ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తాము చెప్పిన వాళ్లకే పనులు చేయాలని ఉద్యోగులకు హుకుం జారీ చేశారు. హౌసింగ్ విభాగంలోకి వెళ్లి.. మీపై చాలా ఆరోపణలు ఉన్నాయి. మిమ్మల్ని ఉద్యోగంలోకి తీసుకున్నది ఎవరు? జాగ్రత్తగా పని చేయకపోతే మిమ్మల్ని ఎవరూ కాపాడలేరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యాలయంలో ఉద్యోగులపై మండిపడిన మంత్రి ఇంతటితో ఆగకుండా ఛైర్‌పర్సన్ లేని సమయంలో ఆమె చాంబర్‌లోకి వెళ్లడం విమర్శలకు తావిచ్చింది. చాంబర్‌లోకి వెళ్లీ వెళ్లడంతోనే ఈమెకు (ఛైర్‌పర్సన్‌కు) ఇంత చాంబర్ అవసరమా?! గవర్నమెంట్ అధికారులకు కూడా ఇన్ని సౌకర్యాలు లేవు. ఇక్కడ ఇన్ని కుర్చీలు అవసరమా? ఆఫీసంతా సీసీ కెమెరాలున్నాయి.

సీసీ కెమెరాల మానిటరింగ్ ఛైర్‌పర్సన్ చాంబర్‌లో ఎలా పెడతారు? ఆమె ఇక్కడ కూర్చొని కార్యాలయంలోకి ఎవరెవరు వస్తున్నారు.. ఏ విభాగంలో ఏం పనులు జరుగుతున్నాయి.. అని మానిటరింగ్ చేస్తోందా? వెంటనే వీటిని తొలగించండి అంటూ అధికారులను ఆదేశించారు.

# హలో గురు ప్రేమకోసమే మూవీ రివ్యూ



ఎనర్జిటిక్ హీరో రామ్, మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ జంటగా తెరకెక్కిన రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ హలో గురు ప్రేమ కోసమే దసరా కానుకగా నేడు (అక్టోబర్ 18న) విడుదలైంది. సినిమా చూపిస్తా మామ, నేను లోక్ల్ చిత్రాల డ్రుక్కుడు త్రినాథ్రావు నక్కిన ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉన్నది ఒకటే జిందగీ చిత్రం తరువాత రామ్, అనుపమ ఈ చిత్రంలో జంటగా నటించారు. హైపర్, ఉన్నది ఒకటే జిందగీ లాంటి వరుస ఫ్లాప్‌లతో డీలా పడ్డ రామ్.. హలో గురు ప్రేమ కోసమే చిత్రం ద్వారా హిట్ కొట్టాడా? హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ వర్కౌట్ అయిందా? రివ్యూలోకి వెళ్లి తెలుసుకుందాం.

కథ, కథనం ఎలా ఉన్నాయి?

కాకినాడలో అమ్మానాన్నతో లైఫ్ ఎంజాయ్ చేసే సంజు (రామ్) జాబ్ కోసం హైదరాబాద్ బయల్దేరతాడు. ఈ ప్రయాణంలో అతడికి అను (అనుపమ) పరిచయం అవుతుంది. సంజు వాళ్లమ్మకు స్నేహితుడు, అను తండ్రి అయిన ప్రకాష్ రాజ్ హైదరాబాద్‌లో సంజుకి షెల్టర్ ఇస్తాడు. ట్రైనర్‌గా ఐటీ జాబ్‌లో చేరిన సంజు.. ఆఫీసులో ప్రణీతను ఇంప్రెస్ చేస్తాడు. తర్వాత తను అనుపమను ప్రేమిస్తున్నానని రియలైజ్ అవుతాడు. ప్రణీత లవ్ ప్రపోజల్‌ను రిజెక్ట్ చేస్తాడు. ఈలోగా ప్రకాష్ రాజ్ తన కూతురికి మరో సంబంధం చూస్తాడు. దీంతో సంజు షాకవుతాడు. ఈ ట్విస్ట్‌తో ఫస్టాఫ్ ముగుస్తుంది. ప్రణీతకు సంజు ఎందుకు నో చెప్పాడో డైరెక్టర్ కన్విన్స్‌గా చెప్పలేకపోయాడు.

తొలి అర్ధ భాగం సరదా సరదాగా గడిచిపోతుంది. ఆఫీసులో వచ్చే సన్నివేశాలు కామెడీ పండించాయి. ప్రణీత తండ్రికి, రామ్ మధ్య వచ్చే డేటాబేస్, ఊప్స్ కాన్సెప్ట్ ప్రశ్నల సీన్లయితే కడుపుబ్బా నవ్విస్తాయి. ఇక సెకండాఫ్ కాస్త నెమ్మదించింది. ఫస్టాఫ్‌లో కామెడీ పండించడంలో సక్సెస్ అయిన డైరెక్టర్.. సెకండాఫ్‌లో మరింత గ్రిప్పింగ్ కథనాన్ని నడిపించలేకపోయాడు. ప్రకాశ్ రాజ్, రామ్ మధ్య వచ్చే సన్నివేశాలు మరి కాస్త ఎఫెక్టివ్‌గా ఉంటే బాగుండనిపిస్తుంది. మధ్య మధ్యలో కామెడీ పంచుతూనే, కాస్త సెంటిమెంట్ టచ్ చేసి.. బోర్ కొట్టకుండా లాగించాడు.

ఎవరెలా చేశారంటే..

హీరో రామ్ చాలా ఎనర్జిటిక్‌గా నటించాడు. లవ్, కామెడీ స్టోరీల్లో అతడి నటన ఎలా ఉంటుందో.. రెడీ, నేను శైలజ చిత్రాల్లో చూశాం. ఈ సినిమాలోనూ రామ్ మరోసారి తన నటనతో ఆకట్టుకున్నాడు. ఇక అను తండ్రిగా ప్రకాశ్ రాజ్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఓ పక్క అమ్మాయి తండ్రిగా.. మరో పక్క తన కూతుర్ని ప్రేమించిన కుర్రాడికి స్నేహితుడిగా తనకే సాధ్యమైన నటనను కనబరిచారాయన.

అను తల్లిగా ఆమని మాట్లాడే బట్లర్ ఇంగ్లిష్ నవ్విస్తుంది.

ఈ సినిమాలో మరో కీలకమైన పాత్ర అనుపమది. ఫ్యామిలీ గర్ల్‌గా, తండ్రిని ఎంతో ఇష్టపడే అమ్మాయి పాత్రకు అనుపమ న్యాయం చేసింది. మిగతా పాత్రలన్నీ సందర్భానుసారం వచ్చి వెళ్తుంటాయి.

సాంకేతిక విభాగం పనితీరు..

ఇది రొటీన్ కథే అయినప్పటికీ.. వైవిధ్యంగా తెరకెక్కించేందుకు డైరెక్టర్ ప్రయత్నించాడు. ఎక్కడా బోర్ కొట్టకుండా కథనాన్ని నడిపించారు. కానీ మలి అర్ధ భాగంలో ప్రకాశ్ రాజ్-రామ్ మధ్య వచ్చే సీన్లు మరింత ఎఫెక్టివ్‌గా ఉంటే బాగుండేదనిపిస్తుంది. అనుపమ క్యారెక్టర్‌ను మరింత ఎలివేట్ చేస్తే ప్రసన్న కుమార్ డైలాగ్స్ పేలాయి. కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ వర్క్, దేవీ శ్రీ సంగీతం ఇంకాస్త మెరుగ్గా ఉంటే బాగుండనిపిస్తుంది.

ఫైనల్...

ఓవరాల్‌గా హలో గురు ప్రేమ కోసమే డీసెంట్ మూవీ. కథ రొటీన్‌గా ఉన్నప్పటికీ, ఈ మూవీలో కామెడీ వర్కౌట్ అయ్యింది. సెంటిమెంట్ ఇంకాస్త వర్కౌట్ కావడంతోపాటు, సెకండాఫ్ మరింత గ్రిప్పింగ్‌గా ఉంటే.. సినిమా మరో రేంజ్‌లో ఉండేది. ఏదేమైనా ఈ సినిమా కామెడీతో నవ్విస్తుంది. పండుగ వేళ.. సరదాగా ఫ్యామిలీతో కలిసి హలో గురూ.. అంటూ థియేటర్‌కు వెళ్లొచ్చు.




# పందెం కోడి 2
## మూవీ రివ్యూ



జాతర.. అవును విశాల్ పందెంకోడి 2 ఓ పే..ద్ద జాతర. పగలు ప్రతీకారాలతో ఏడేళ్ల క్రితం ఆగిపోయిన జాతరను తిరిగి జరిపించాలని దీక్ష పూనిన ఓ ఊరిపెద్ద.. అతడికి అండగా నిలిచిన కొడుకు.. జాతరను ఎలాగైనా ఆపాలని ప్రతీకారంతో రగిలిపోయే లేడీ విలన్. ఇదీ స్థూలంగా పందెంకోడి 2 కథ. పదమూడేళ్ళ క్రితం విశాల్, లింగుస్వామి కాంబినేషన్‌లో వచ్చిన 'పందెంకోడి' సూపర్ హిట్‌గా నిలిచి విశాల్‌కు మంచి గుర్తింపు సంపాదించి పెట్టింది. సరిగ్గా పదమూడేళ్ల తరువాత ఇద్దరూ కలిసి ఈ చిత్రానికి సీక్వెల్ తీస్తున్నారంటే ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ అంచనాలను పందెంకోడి 2 అందుకుందా? విశాల్ ఖాతాలో మరో హిట్ పడిందా? మిగిలిన విషయాలు సమీక్షలో తెలుసుకుందాం.. విశాల్ కెరియర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది పందెం కోడి మూవీ. ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన పందెం కోడి 2 విజయదశమి కానుకగా నేడు (అక్టోబర్ 18) ప్రేక్షకుల ముందుకువచ్చింది. విశాల్, కీర్తి సురేష్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో విశాల్ మాజీ ప్రేయసి వరలక్ష్మి శరత్ కుమార్ ప్రతినాయిక పాత్రలో కనిపించారు. ఠాగూర్ మధు సమర్పణలో విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, లైకా ప్రొడక్షన్స్, పెన్ స్టూడియోస్ పతాకాలపై భారీ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రానికి ఎన్.లింగుస్వామి దర్శకత్వం వహించారు.

కథలోకి వెళ్తే.. కడప జిల్లాలో ఆరు ఊళ్లకు పెద్ద రాజారెడ్డి (రాజ్ కిరణ్). అక్కడి ప్రజలకు ఇతనే దేవుడు. ఆయన చెప్పిందే వేదం.. చేసిందే శాసనం. అతని కొడుకే బాలు (విశాల్) అతని ఆధ్వర్యంలో ఆ ఊరిలో వీరభద్ర స్వామి జాతర జరుగుతుంది. భోజనాల వడ్డింపులు దగ్గర వచ్చిన చిన్న గొడవ కారణంతో రెండు ఊళ్లకు చెందిన వాళ్లు కత్తి దూస్తారు. ఇందులో భవాని (వరలక్ష్మి) భర్త చనిపోతారు. ప్రతీకారంగా తన ప్రత్యర్థి వర్గాన్ని ఊచకోత కోయిస్తుంది భవాని. కాని ఆ వంశంలో గోపి అనే యువకుడు మిగిలిపోవడంతో అతన్ని ఎలాగైనా చంపాలని ప్రతీకారంతో రగిలిపోతుంటుంది భవాని. గోపికి అండగా ఉండి అతన్ని కాపాడుతూ ఉన్నత చదువులు చదివిస్తాడు రాజారెడ్డి.

ఆరు ఊళ్ల మధ్య ఉన్న గొడవల కారణంగా ఏడేళ్లపాటు ఆ ఊరిలో వీరభద్ర స్వామి జాతర ఆగిపోతుంది. దీంతో ఆ ఊరిలో వర్షాలు పడక కరువు సంభవిస్తుంది. ఎలాగైనా ఆరు ఊళ్లను కలిపి జాతర జరిపించాలని రాజారెడ్డి జాతర జరిపించేందుకు ఆరు ఊర్లను ఒప్పిస్తాడు. ఈ జాతరలో గోపిని చంపేందుకు ప్లాన్ చేస్తుంది భవాని. అతడ్ని కాపాడే ప్రయత్నంలో రాజారెడ్డికి ప్రాణాపాయం సంభవిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరిలో గొడవలు జరక్కూడదని.. జాతర ఆగటానికి వీల్లేదని ఎలాగైనా ఈ జాతరను పూర్తి చేయాలని బాలు దగ్గర నుంచి మాట తీసుకుంటాడు రాజారెడ్డి. ఈ తరుణంలో తాను ప్రేమించిన చారుమతిని (కీర్తి సురేష్) వదులు కుంటాడు బాలు. తండ్రి ఆశయాన్ని నెరవేర్చడానికి బాలు ఏం చేశారు? తన ప్రేమను ఎలా తిరిగిపొందాడు? భవాని తన పగను ఎలా తీర్చుకుందన్నదే మిగిలిన కథ.

విశాల్ అంటేనే మాస్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రెస్. ఈ మధ్య కాలంలో డిటెక్టివ్, అభిమన్యుడు లాంటి వినూత్న కథలతో ప్రేక్షకులకు ముందుకు వచ్చినా పందెంకోడి సీక్వెల్ అంటే మాస్ ఆడియన్స్‌లో విపరీతమైన అంచనాలు వచ్చేశాయి. అయితే ఆ అంచనానాల్ని రీచ్ కాలేకపోయింది పందెం కోడి 2. రాయలసీమ నేపథ్యంలో పగలు, ప్రతికారాల నేపథ్యంలో ఎప్పటికే బోలెడు కథలు వచ్చాయి. లింగు స్వామి ఎంచుకథలో కొత్తదనం లేకపోవడం.. ఫస్టాఫ్ మొత్తం పర్వాలేదనిపించినా సెకండాఫ్ నెమ్మదిగా సాగడం.. తమిళ వాసనలు అధికంగా గుప్పించడంతో పందెం కోడి 2 తెలుగు నేటివిటీకి పూర్తిగా దూరమైంది. ఎంచుకున్న థీమ్‌కు సరైన స్క్రిప్ట్ ట్రీట్‌మెంట్ లేకపోవడం ఈ సినిమాకు మైనస్.

రాయలసీమకు చెందిన యువకుడి పాత్రలో విశాల్ తన పాత్రకు పూర్తి న్యాయం చేశారు. యాక్షన్, లవ్, ఎమోషన్స్ సీన్స్‌లో తన సహజశైలి నటనతో ఆకట్టుకున్నాడు. ఇక పల్లెటూరి గడుసరి పిల్లగా చారుమతి పాత్రలో కీర్తి సురేష్ అదిరిపోయే పెర్ఫామెన్స్ ఇచ్చింది. పల్లెటూరి అమ్మాయి పాత్రలో ఒదిగిపోయింది. జాతరలో మాస్ బీట్‌కు కీర్తి వేసిన స్టెప్పులు సినిమాకే హైలైట్. విశాల్, కీర్తి సురేష్‌ల మధ్య లవ్ సీన్స్ బాగా పండాయి. అయితే ఫస్టాఫ్‌లో సరదాగా సాగుతున్న లవ్ ట్రాక్ సెకండాఫ్‌లో నెమ్మదించింది. వీరి లవ్ బ్రేకప్‌కి బలమైన సీన్ లేకపోవడంతో పాటు దర్శకుడు చూపించిన రీజన్ చాలా సినిమాటిక్‌గా అనిపిస్తుంది.

ఇక భవాని పాత్రలో నటించిన వరలక్ష్మి పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. తొలి నుండి సీరియస్ లుక్‌లో ఒకే ఒక్క ఎక్స్‌ప్రెషన్‌తో నడిపించేసింది. క్లైమాక్స్ సీన్‌లో పర్వాలేదనిపించినా ప్రతినాయికగా పూర్తి న్యాయం చేయలేకపోయింది. విశాల్‌కి తండ్రి పాత్రలో నటించిన రాజారెడ్డి గంభీరమైన నటనతో ఆకట్టుకున్నారు. సినిమాలో హీరోతో సమానంగా ఆయన క్యారెక్టరైజేషన్ ఉంది. హీరోతో పోటీపడి నటించారు. తండ్రీ కొడుకుల మధ్య వచ్చే ఎమోషన్స్ సీన్ ఆకట్టుకున్నాయి.

టెక్నికల్ పరంగా యువన్ శంకర్ రాజా సంగీతం పెద్దగా వర్కౌట్ కాలేదు. నేపథ్య సంగీతం పర్వాలేదనిపించింది. శక్తివేల్ సినిమాటోగ్రఫీ బాగుంది. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో జాతర సెటప్ కలర్ ఫుల్‌గా చూపించారు. ఎడిటర్ కె. ఎల్ ప్రవీణ్ అక్కర్లేని సీన్లను ట్రిమ్ చేసి ఉంటే బావుండేది. ఈ సినిమాలో చాలా సీన్లు సాగదీసినట్టుగా ఉన్నాయి.

చివరిగా.. దర్శకుడు లింగుసామి ఎప్పుడో పదమూడేళ్ల క్రితం వచ్చిన పందెం కోడి దగ్గరే ఆగిపోయారు. అందుకే పందెం కోడి 2 జాతర కథ మిస్ ఫైర్ అయ్యింది. ఓవరాల్‌గా ఈ జాతర కేవలం మాస్ ఆడియన్స్ కోసమే.

# ఆధార్‌తో అనుసంధానించిన సిమ్ కార్డులు డిస్‌కనెక్ట్ అవుతాయా?



న్యూఢిల్లీ : ఆధార్‌తో అనుసంధానం చేసిన 50 కోట్ల సిమ్ కార్డులు డిస్‌కనెక్ట్ అయ్యే ప్రమాదం ఉంది. ఆధార్ వెరిఫికేషన్ కోసం కస్టమర్లు అందించిన ఇ-కేవైసీ సమాచారాన్ని ఆరు నెలల్లోగా పూర్తిగా తొలగించాలని టెలీకాం కంపెనీలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.. అనే కథనం గత కొద్ది రోజులుగా ప్రచారంలో ఉంది. అదే నిజమైతే దేశంలోని దాదాపు సగం సిమ్ కార్డులు పనికి రాకుండా పోతాయి. కానీ ఈ వార్తలేవీ నిజం కాదని టెలీకాం శాఖ, యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సంయుక్తంగా ప్రకటించాయి. ఏమాత్రం ఆందోళన చెందొద్దని ప్రజలకు సూచించాయి.

సిమ్ కార్డుల జారీకి కొత్త డిజిటల్ అథెంటికేషన్ ప్రక్రియను చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అథంటికేషన్ వివరాలను ఆరు నెలలకు మించి ఉంచుకోవద్దని మాత్రమే యూఐడీఏఐకి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. అంతేగానీ అథంటికేషన్ లాగ్‌కు సంబంధించి టెలీకాం కంపెనీలకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు.

టెలీకాం సంస్థలు లేదా ఏయూఏలు లేదా కేయూఏలు అథెంటికేషన్ లాగ్ డిలీట్ చేయాల్సిన అవసరం లేదని టెలీకాం శాఖ తెలిపింది. ఎవరైనా తమ ఇ-కేవైసీని తాజా కేవైసీతో మార్చుకోవాలని భావిస్తే.. సర్వీస్ ప్రొవైడర్‌ను కోరడం ద్వారా తాజా ఓవీడీలను సమర్పించొచ్చని స్పష్టం చేసింది.

ఇ-కేవైసీ అథంటికేషన్ ద్వారా కొత్త సిమ్ కార్డులను జారీ చేయడంపై సుప్రీం కోర్టు నిషేధం విధించిందని టెలీకాం శాఖ, యూఐడీఏఐ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. నూతన ప్రక్రియ ప్రకారం.. సిమ్ కార్డు తీసుకునే వ్యక్తిని అక్షాంశ, రేఖాంశాలు సహా ఫొటో తీసుకుంటారు. ఆ ఫొటోను ఎప్పుడు తీశారో తెలుసుకునేందుకు వీలుగా టైం స్టాంప్ కూడా ఉంటుంది. ఐడీ కార్డును కూడా ఫొటో తీస్తారు. సిమ్ కార్డు ఏజెంట్ ఓటీపీ ద్వారా కొత్త సిమ్ కార్డ్ జారీ చేస్తాడు. ఇదంతా మొబైల్ యాప్ ద్వారే జరగనుంది.

# ఢిల్లీకి పంజాబ్ సీఎం పరుగు..!



న్యూఢిల్లీ: పంటల కాల్చివేత కారణంగా వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడంతో పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. రైతులకు పరిహారం ఇప్పించాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి విజ్ఞప్తి చేశారు. పంట కాల్చివేతలు మరింత పెరిగే అవకాలు ఉన్నందున వెంటనే దీనికి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో అధికారుల నియామకాల్లో 60:40 మేర ఉన్న హర్యానా, పంజాబ్ నిష్పత్తిని కదల్చకూడదని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ప్రధానికి అమరీందర్ కృతజ్ఞతలు తెలిపారు. దట్టమైన పొగల కారణంగా ఢిల్లీలో ప్రస్తుతం వాయుకాలుష్య స్థాయిలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. దీనికి పంజాబ్, హరియాణాల్లో పంట నూర్పిళ్ల అనంతరం వ్యర్థాల కాల్చివేతే కారణమని భావిస్తున్నారు. పంటల కాల్చివేతపై నిషేధం ఉన్నప్పటికీ.... వాటిని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ఆర్థిక సాయం చేయకపోవడంతో తమకు వేరేదారి లేదని రైతులు చెబుతున్నారు.

# పోషకాహారలోపంతో 12 మంది గిరిజన పిల్లల మృతిపై హైకోర్టు సీరియస్

ముంబై : పోషకాహార లోపంతో 12మంది గిరిజన పిల్లలు మరణించిన ఘటనను బాంబే హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. మహారాష్ట్రలోని మెల్ఘాట్ గిరిజన ప్రాంతంలో పోషకాహారలోపం వల్ల ఈ నెల మొదటి రెండు వారాల్లో 12 మంది గిరిజన పిల్లలు మరణించారని సోషల్ యాక్టివిస్టు బి సానీ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన బాంబే హైకోర్టు బెంచ్ జస్టిస్ అభయ్ ఒక, ఎంఎస్ సోనక్ లు దీనిపై ప్రజారోగ్యం, మహిళా శిశుసంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖల అధికారులు మెల్ఘాట్ ప్రాంతాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులపై వెంటనే నివేదిక సమర్పించాలని బాంబే హైకోర్టు మహారాష్ట్ర సర్కారును ఆదేశించింది.







# సైనా.. ఎన్నాళ్లకో సివంగిలా!

ఓడెన్స్ (డెన్మార్క్): భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ సంచలనం సృష్టించింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత తొలిసారి తన ప్రియమైన ప్రత్యర్థి అకానె యమగూచి (జపాన్)ని ఓడించింది. డెన్మార్క్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆమె 21-15, 21-17తో వరుస గేముల్లో యమగూచిని చిత్తుచేసింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్ 3 నజోమి ఒకుహర (జపాన్)తో తలపడనుంది.

ప్రస్తుతం యమగూచి ప్రపంచ రెండో ర్యాంకర్ కాగా సైనా 27వ ర్యాంకులో ఉంది. వీరిద్దరూ ఇప్పటి వరకు ఎనిమిది సార్లు తలపడగా ఆరు సార్లు యమగూచిదే విజయం. 2014లో చైనా ఓపెన్‌లో తొలిసారి యయగూచిని ఓడించిన సైనా మరో గెలుపు కోసం నాలుగేళ్ల ఎదురుచూసింది. ఈ ఏడాది మేలో ఉబెర్ కప్, జూన్‌లో మలేసియా ఓపెన్‌లో ఫలితాలు యమగూచికే అనుకూలంగా వచ్చాయి.

డెన్మార్క్ ఓపెన్ తొలి గేమ్‌లో సైతం తొలుత 0-4తో సైనా వెనుకంజ వేసినా తర్వాత పుంజుకొని 10-10తో స్కోరు సమం చేసింది. వరుసగా ఐదు పాయింట్లు సాధించి 15-10తో ఆధిక్యంలోకి వెళ్లింది.


















పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు,
విజయ దశమి
శుభాకాంక్షలు


LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750











• VIJAYABHANU - Visakhapatnam •
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com